Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

ప్రజా TV PRAJA TELEVISION The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 333 | హైదరాబాద్ | సోమవారం 19 అక్టోబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- కారు డ్రైవర్, ఆటో డ్రైవర్‌కు గాయాలు

ముంబయి: బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై ముంబయిలోని జుహూ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ష్రాఫ్ సురక్షితంగా తప్పించుకోగా, ఆయన కారు డ్రైవర్ ఫిర్దోస్, ఆటో డ్రైవర్ చౌహాన్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గుర్తుతెలియని వ్యక్తి టైగర్ ష్రాఫ్, ఆయన స్నేహితుడు ఉన్న వాహనంపై కాల్పులు జరిపినట్లు ప్రాథమిక సమాచారం. ఫిర్దోస్ ఎడమ చేతికి గాయమైంది. కాల్పులకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. క్రైమ్ బ్రాంచ్, స్థానిక పోలీసులు కలిసి దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఫోరెన్సిక్ బృందం తూటాల ఆనవాళ్లు, వాహనానికి సంబంధించిన ఆధారాలను సేకరించింది. ఈ దాడికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహించినట్లు సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టు వైరల్ అవుతోంది.



ఆ ముగ్గురినీ వదలం

- 'ఓట్ల చోరీ'పై రాహుల్ గాంధీ

మార్గావ్ (గోవా), అక్టోబరు 18

దేశంలో ఓట్ల చోరీ ప్రణాళికను రూపొందించింది ప్రధాని మోదీయేనని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. తెరవెనుక ఆయన రచించిన ప్రణాళికను కేంద్ర హోం మంత్రి అమిత్ షా కార్యరూపంలోకి తీసుకొచ్చారని.. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అమలు చేశారని ఆరోపణలు గుప్పించారు. ప్రస్తుతం ఈ ముగ్గురూ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని.. ఓట్ల చోరీకి వారు తగిన మూల్యం చెల్లించుకుంటారని స్పష్టం చేశారు. దక్షిణ గోవాలోని మార్గావ్‌లో రాహుల్ ఆదివారం ఓ ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు."నాపై 45కుపైగా పరువు నష్టం కేసులున్నాయి. మోదీ, షాల సన్నిహితులు దాఖలు చేసినవి వాటిలో ఉన్నాయి. అయితే ఓట్ల చోరీలో ప్రధాని పాత్ర ఉందని నేనన్నందుకు ఒక్క కేసు కూడా ఎవరూ నాపై నమోదు చేయలేదు. ఎందుకంటే ఓట్ల చోరీ ఆరోపణలకు సంబంధించి కేసు నమోదైతే.. అది పూర్తిస్థాయిలో చట్టపరమైన వ్యవహారంగా మారుతుందని, అందులో వారు చిక్కుకుపోతారని వారికి -2వ పేజీలో



లంచావతారులకు ఆ రక్షణ వర్తించదు

- సుప్రీం కోర్టు స్పష్టీకరణ

ఢిల్లీ, అక్టోబరు 18 (ప్రజాతీర్పు)

అవినీతి కేసుల్లో ప్రభుత్వ ఉద్యోగులపై విచారణ జరిపేందుకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్-17(ఎ) కింద అధీకృత వ్యవస్థ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్న నిబంధన లంచావతారులకు వర్తించదని సుప్రీంకోర్టు -2వ పేజీలో



నేలంతా పూలవనం..

బతుకమ్మకు ప్రణామం



- రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా వేడుకలు
- ట్యాంక్‌బండ్‌పై ఆకట్టుకున్న సంబురాలు
- ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మలతో ర్యాలీగా తరలివస్తున్న మహిళలు

హైదరాబాద్, అక్టోబరు 18 (ప్రజాతీర్పు)

తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలు.. వాటిపై కలికితురాయిలా కొలువైన గౌరమ్మలు.. పట్టు చీరల తళతళలు.. పసిడి కాంతుల మిలమిలలతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో -2వ పేజీలో





వర్గల్ విద్యా సరస్వతి అమ్మవారిని

దర్శించుకున్న హరీష్ రావు దంపతులు

- సతీమణి శ్రీనితతో కలిసి ప్రత్యేక పూజలు

సిద్దిపేట, అక్టోబరు 18 (ప్రజాతీర్పు)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సిద్దిపేట జిల్లా వర్గల్ శ్రీ విద్యా సరస్వతి అమ్మవారిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు ఆదివారం దర్శించు కున్నారు. తన సతీమణి శ్రీనితతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందారు. హరీష్ రావు వెంట గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది.

ఎల్‌నినో కష్టాల్లో ప్రజలు.. పోస్టుల వేటలో నాయకులు

- సాగు, తాగునీరు, విద్యుత్ కోతలతో జనాల అవస్థలు
- సమస్యలను పక్కనపెట్టి 'నామినేటెడ్' కోసం పైరవీలు
- దసరా తర్వాతే పోస్టుల భర్తీపై ప్రభుత్వ ఆలోచన
- కష్టపడ్డ కార్యకర్తలకే పదవులు అని స్పష్టం చేసిన అధిష్టానం

హైదరాబాద్, అక్టోబరు 18 (ప్రజాతీర్పు)

ఎండిన పొలాలను చూస్తూ రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రజలకు అండగా నిలవాల్సిన కొందరు నాయకులు నామినేటెడ్ పదవుల కోసం పార్టీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన వేళ పదవుల వేటపై దృష్టి సారించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలమట్టాల తగ్గుదల, సాగునీటి లభ్యతపై ఆందోళనలు నెలకొన్నాయి. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటల ఎదుగుదల, పెట్టుబడులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగునీరు, పట్టణాలు, పల్లెల్లో తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి -2వ పేజీలో





సర్కారుకు నై.. ప్రైవేటుకు సై

- ఎల్‌నినో ప్రభావంతో సన్నవడ్లకు డిమాండ్ .. క్వింటాల్ ధర రూ.4 వేలు
- ప్రైవేటు వ్యాపారుల వద్ద ధాన్యం విక్రయానికే రైతుల మొగ్గు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తగ్గుతున్న ధాన్యం
- భవిష్యత్తులో బియ్యం ధరల పెరుగుదల.. సన్న బియ్యం పంపిణీపై ప్రభావం

హైదరాబాద్, అక్టోబరు 18 (ప్రజాతీర్పు)

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రంలో సన్నవడ్లకు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాదని రైతులు తమ దిగుబడిని ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కారణం -2వ పేజీలో



పండుగకు ఊరెళ్తున్నారా?

బస్సు చార్జీలు చూస్తే షాకే!

- సొంతూళ్లకు భారీగా నగర వాసులు
- అదనంగా 1,100 ఆర్టీసీ బస్సులు
- ప్రైవేట్‌లో ప్రయాణికులపై నిలువుదోపిడీ

హైదరాబాద్, అక్టోబరు 18 (ప్రజాతీర్పు)


నగరం పల్లెబాట పట్టింది. సద్దుల బతుకమ్మ, దసరా పండగ రద్దీ పోటెత్తింది. వారం రోజులుగా కొనసాగుతున్న పండుగ రద్దీ శనివారం భారీగా పెరిగింది. ఆదివారం సద్దుల బతుకమ్మ కావడంతో ఆర్టీసీ బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాల్లో జనం సొంత ఊరు బాట పట్టారు. మహాత్మాగాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్‌లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రెగ్యులర్‌గా రాకపోకలు సాగించే బస్సులతో పాటు 50 శాతం అదనపు చార్జీలతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. శనివారం ఒక్కరోజే సుమారు 1,100కు పైగా ప్రత్యేక బస్సులను -2వ పేజీలో

నేలంతా పూలవనం..
బతుకమ్మకు ప్రణామం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన కార్యక్రమం అట్టహాసంగా సాగింది. అమరవీరుల జ్యోతి నుంచి సాగిన బతుకమ్మ కార్నివాల్‌లో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. 700 మంది కళాకారులు 30కిపైగా ప్రదర్శనలు ఇచ్చారు. ముందు వరుసలో కళాకారులు నృత్యాలు చేసుకుంటూ సాగగా వారి వెనుక అతిథులు, బతుకమ్మలతో మహిళలు తరలివచ్చారు. వేదిక వద్ద బతుకమ్మలను పేర్చి మహిళలు వాటి చుట్టూ తిరుగుతూ పాడుతూ ఆడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా సతీసమేతంగా విచ్చేశారు.సినీనటులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అతిథులందరిని జ్ఞాపికలతో సత్కరించారు. మంత్రి సీతక్క బతుకమ్మతో వచ్చి ఆడిపాడారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. 'ప్రకృతితో ప్రజలకు ఉన్న విడదీయరాని అనుబంధానికి ప్రతీకే బతుకమ్మ పండగ. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందరూ పర్యావరణ పరిరక్షణకు ప్రతినబూనాలి. నీటి సంరక్షణ ప్రతి పౌరుడి కర్తవ్యం' అని అన్నారు.





మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. 'బతుకమ్మ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. ఒకప్పుడు దేశవ్యాప్తంగా హిందీ, పంజాబీ పాటలు వినిపించేవి. ఇప్పుడు ప్రపంచమంతా తెలంగాణ జానపద గేయాలు మార్మోగుతున్నాయి. విజయ్ దేవరకొండ, రష్మికతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తెలంగాణ పర్యాటక రంగానికి ప్రచారకర్తలుగా నిలవాలి. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురానున్న 'ప్రభాత భేరీ' కార్యక్రమంలో కవులు, కళాకారులు పాల్గొనాలి' అని జూపల్లి పిలుపునిచ్చారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆరోగ్యాన్ని, ఆత్మీయతను పంచే పండగ ఇదని అన్నారు.

సినీ నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో రష్మికతో పెళ్లి కాగా, రాష్ట్రంలో పెద్దఎత్తున బతుకమ్మ ఎక్కడ ఆడుతారో అక్కడ ఆమెతో బతుకమ్మ ఆడించాలని మార్చిలోనే నిర్ణయించుకున్నానన్నారు. అనుకున్నట్లే ఇక్కడికి వచ్చామని, ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. రష్మిక మాట్లాడుతూ.. 'తెలంగాణ కోడలిగా బతుకమ్మ ఆడుదామని వచ్చా. మీరు బతుకమ్మ నేర్పించండి. పెళ్లికాకముందు అందరూ మేడం అని పిలిచేవారు. ఇప్పుడు అందరూ వదినా అని, చిన్నపిల్లలు అత్తా అని పిలుస్తున్నారు. ఒక పెద్ద కుటుంబంలో చేరినట్లు ఎంతో సంతోషంగా ఉంది' అని అన్నారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ ప్రపంచంలో పువ్వులను పూజించే ఏకైక పండగ బతుకమ్మ అని పేర్కొన్నారు. వేడుకలో గవర్నర్ సతీమణి జానకి శుక్లా, హైదరాబాద్‌లో అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, జర్మనీ హానరరీ కాన్సుల్(ఏపీ, తెలంగాణ) అమితా దేశాయ్, బ్యూరో డి ఫ్రాన్స్ హెడ్ పియర్ బియోడిన్, డిప్యూటీ హెడ్ రోహిణి, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ పొలిటికల్, ఎకనమిక్ అడ్వైజర్ నళిని రఘురామన్, విమలక్క తదితరులు పాల్గొన్నారు.వేడుకల్లో తెలంగాణ పర్యాటకం, సాంస్కృతిక శాఖ, శిల్పారామం, ఆర్టీసీ, రామోజీ ఫిల్మ్‌సిటీ భాగస్వామ్యంతో రూపొందించిన తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లేజర్‌షో, బాణసంచా ప్రదర్శన వేడుకలకు మరింత వైభవాన్ని తీసుకొచ్చాయి.

ఎల్‌నినో కష్టాల్లో ప్రజలు..
పోస్టుల వేటలో నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలను గుర్తించడం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం నాయకుల బాధ్యతగా భావిస్తున్నారు. అయితే, కొందరు నేతలు కార్పొరేషన్లు, ప్రభుత్వ సంస్థల్లో పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కార్పొరేషన్లు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో పదవులు దక్కించుకోవాలనే ఆశతో పార్టీ ముఖ్య నేతలు, మంత్రులు, అధిష్టానం పెద్దలను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు పదవులు దక్కడం సహజమే అయినప్పటికీ.. ప్రజలు సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో నాయకుల ప్రాధాన్యాలు ఎలా ఉండాలన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. రైతుల ఇబ్బందులు, సాగునీటి సమస్యలు, తాగునీటి కొరత, విద్యుత్ సరఫరాపై ప్రజల్లో ఉన్న ఆందోళనలను పరిష్కరించేందుకు చొరవ చూపాల్సిన నాయకులు.. పదవుల కోసం పైరవీలకే పరిమితమవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వానికి వాటిని నివేదించడం, పరిష్కారానికి కృషి చేయడం ద్వారా నాయకులు తమ నిబద్ధతను నిరూపించుకోవాల్సి ఉందని పార్టీ శ్రేణుల్లో కొందరు అభిప్రాయపడుతున్నారు. పదవుల కోసం చేసే ప్రయత్నాల కంటే ప్రజలకు అండగా నిలిచే నాయకత్వానికే ప్రాధాన్యం ఇవ్వాలనే వాదన వినిపిస్తోంది.

పదవుల పంపిణీపై అచితూచి నిర్ణయం

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యతపై ఆందోళనల నేపథ్యంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించాలనే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రజలు నీరు, విద్యుత్, వ్యవసాయ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో కార్పొరేషన్ పదవుల భర్తీకి ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశమని, పరిస్థితులు కొంత మెరుగుపడిన తర్వాతే నామినేటెడ్ పదవుల అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలనే యోచన ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దసరా తర్వాత నామినేటెడ్ పోస్టుల భర్తీపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది.

కష్టపడ్డ కార్యకర్తకే కార్పొరేషన్ పోస్టులు

పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నది కాంగ్రెస్ అధిష్టానం వైఖరిగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఆదరణ, క్షేత్రస్థాయిలో పనిచేసిన తీరు ఆధారంగా పదవుల కేటాయింపు జరగాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వ్యక్తిగత పరిచయాలు, పలుకుబడికే కాకుండా పార్టీ కోసం చేసిన కృషికి ప్రాధాన్యం ఇవ్వాలని శ్రేణులు కోరుతున్నాయి. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులకు ప్రస్తుత పరిస్థితులు ఒక పరీక్షగా మారాయి. రైతుల సమస్యలు, తాగునీటి కొరత, విద్యుత్ ఇబ్బందులపై చొరవ చూపుతూ ప్రజలకు అండగా నిలిస్తేనే విశ్వసనీయత పెరుగుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పదవుల కోసం ప్రయత్నించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే పార్టీకి, ప్రభుత్వానికి మేలు జరుగుతుందని పేర్కొంటున్నాయి.

సీర్కారుకు నై.. ప్రైవేటుకు సై

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు వ్యాపారులు రైతుల కల్లాల వద్దకే చేరుకుని క్వింటాల్‌కు రూ.4 వేల వరకు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ధర తమకు గిట్టుబాటు కావడంతో రైతులు కూడా ప్రైవేటు వ్యాపారులకే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధరతోపాటు బోనస్ ప్రకటించినా.. బహిరంగ మార్కెట్‌లో అధిక ధర లభిస్తుండడమే ఇందుకు కారణం. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నధాన్యం రాక తగ్గుతోందని అధికారులు చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో పంట దిగుబడులు తగ్గవచ్చన్న అంచనాతో ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్రంలో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 65 రూపాలయకు విక్రయించాల్సిన కిలో బియ్యాన్ని రూ.80 వరకు పెంచారు. పాలిస్ బియ్యం కిలోకి రూ.100 వరకు పెంచనున్నట్లు చెబుతున్నారు.సన్నవడ్ల కొనుగోళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,224 కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ సీజన్‌లో 65 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఆశించిన స్థాయిలో చేరడం లేదని సమాచారం. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకారం సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,441, గ్రేడ్-ఏ రకానికి రూ.2,461 చెల్లించనున్నారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వర్తిస్తుంది. ఈ లెక్కన మద్దతు ధర, బోనస్ కలిపి రూ.2,941 వరకు లభిస్తుంది. మరోవైపు నిజామాబాద్ జిల్లాలో పచ్చి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.3,500 నుంచి రూ.3,900 వరకు ధర పలుకుతున్నట్లు అక్కడి మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నాణ్యత, తేమ శాతాన్ని బట్టి ధరల్లో మార్పులుంటున్నాయి.

రేషన్ బియ్యం సేకరణపై ప్రభావం?

రాష్ట్రంలో సుమారు 3.20 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులకు ప్రతి నెలా ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ పథకానికి అవసరమైన బియ్యాన్ని నిరంతరంగా అందించాలంటే తగిన పరిమాణంలో సన్నధాన్యం సేకరించడం కీలకమని సంబంధిత అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక తగ్గితే లక్ష్యాన్ని చేరుకోవడంలో ఇబ్బందులు తలెత్తవచ్చు. అవసరమైన బియ్యాన్ని బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేయాల్సి వస్తే ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉంది.

లంచావతారులకు ఆ రక్షణ వర్తించదు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. విధి నిర్వహణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలు, చేసిన సిఫార్సులకే ఈ రక్షణ వర్తిస్తుంది తప్ప.. లంచాలకు సంబంధించి కాదని తేల్చి చెప్పింది. రాజస్థాన్‌కు చెందిన పోలీసు కానిస్టేబుల్.. ఒక నిందితుడిని నేరం నుంచి తప్పించేందుకు సహకరించడం కోసం లంచం తీసుకున్నాడు. ఈ వ్యవహారంలో ఏసీబీ కోర్టు స్పెషల్ జడ్జి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్-7 కింద అభియోగాలు ఖరారు చేసి విచారణకు అనుమతించారు. సెక్షన్-17(ఎ) కింద అనుమతులు తీసుకోక ముందే తనపై విచారణకు ఉపక్రమించడాన్ని ఆ కానిస్టేబుల్ సవాలు చేశాడు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ నిర్వహించిన జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం.. లంచగొండుల విషయంలో సెక్షన్-17(ఎ) రక్షణ వర్తించదంటూ తీర్పు వెలువరించింది.

మా తీర్పును కాగితాలకే పరిమితం చేస్తారా?

రుతుక్రమ ఆరోగ్యం ప్రాథమిక హక్కుల్లో భాగమేనంటూ తాము వెలువరించిన తీర్పు అమలవుతున్న తీరును రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కేంద్రానికి నివేదించకపోవడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తమ తీర్పును కాగితాలకే పరిమితం చేస్తారా అని ప్రశ్నించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్-21 ప్రసాదించే 'జీవించే హక్కు'లో రుతుక్రమ ఆరోగ్యమూ భాగమేనని ప్రకటిస్తూ ఈ ఏడాది జనవరి 30న సుప్రీం తీర్పు వెలువరించింది. ఇందుకోసం ప్రతి పాఠశాలలో తగిన సదుపాయాలు కల్పించాలని తర్వాత ఆదేశించింది. ఆ తీర్పు ఎలా అమలవుతోందో నివేదించాలని తాము కోరినప్పటికీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి స్పందన రాలేదని ఈ నెల 13న కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీ సుప్రీం కోర్టుకు తెలిపారు. దీంతో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

లేహ్‌లో లద్దాఖ్ ధర్మాసనాన్ని ప్రారంభించిన సీజేఐ

లేహ్: జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ హైకోర్టుకు చెందిన లద్దాఖ్ ధర్మాసనాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ లేహ్‌లో ఆదివారం ప్రారంభించారు. ఇది పూర్తి స్థాయి ఐటీ సామర్థ్యాన్ని కలిగి ఉండి, కాగిత రహిత కోర్టుగా పని చేయనుంది. ఇక్కడ ఈ-ఫైలింగ్ పోర్టల్, ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ పోర్టల్‌సహా పలు డిజిటల్, గ్రీన్ కార్యక్రమాలను సీజేఐ ప్రారంభించారు.



చోర్‌బగాన్ విషాదం..
19కి చేరిన మృతుల సంఖ్య

అక్టోబరు 18 ప్రజాతీర్పు

ఉత్తర కోల్‌కతాలోని ప్రసిద్ధ చోర్‌బగాన్ సార్వజనీన దుర్గా పూజ మండపం వద్ద శనివారం రాత్రి జరిగిన ఘోర తొక్కిసలాటలో మృతుల సంఖ్య 19కి చేరింది. మహా సప్తమి వేడుకల సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చిన సమయంలో ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం వల్ల ఈ విషాదం చోటుచేసుకుంది. వర్షం నుంచి తప్పించుకోవడానికి జనం ఒక్కసారిగా మండపం లోపలికి చొచ్చుకురావడంతో పాటు, ఎగ్జిట్ గేట్ల వద్ద తీవ్రమైన తోపులాట జరిగి ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మరో 25 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 'కోల్‌కతా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (వీజన)'కి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఒకరి పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉంది. మృతుల్లో 13 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి బాధితులను పరామర్శించారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి గ్రూప్-డి ప్రభుత్వ ఉద్యోగం, అలాగే గాయపడిన వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. బాధితుల వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు.

అదేవిధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పీఎంఆర్ఎఫ్ నుంచి సహాయం ప్రకటించారు.

ఈ ఉత్సవ నిర్వహణలో జరిగిన లోపాలపై దర్యాప్తు చేయడానికి కలకత్తా హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. శాంతిభద్రతల లోపాలు, నిర్లక్ష్యం వహించినందుకు గానూ పూజా కమిటీ నిర్వాహకులు, వాలంటీర్లతో కలిపి ఏడుగురిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రస్తుతం ఈ చోర్‌బగాన్ పూజా మండపాన్ని సందర్శకుల కోసం పూర్తిగా మూసివేశారు.

భారత్‌లో 11 లక్షల మందికి పైగా ఉపాధ్యాయుల కొరత

దేశంలో లక్ష ఏకోపాధ్యాయ పాఠశాలలు

2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా మరో 5కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరంయునెస్కో వెల్లడి

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల కొరత ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం.. 2030 నాటికి పిల్లలందరికీ తక్కువ ఖర్చులో విద్యను అందించి ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలి. అయితే యునెస్కో ఇటీవల విడుదల చేసిన గ్లోబల్ రిపోర్టు ఆన్ టీచర్స్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత విద్యా వ్యవస్థను కుదిపేస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి సెకండరీ స్థాయి వరకు ప్రతి చిన్నారికి మెరుగైన విద్య అందించాలంటే 2030 నాటికి మరో 5 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరమని నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 10.7 కోట్ల మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, ప్రతి ఇద్దరు ఉపాధ్యాయులకు అదనంగా మరో ఉపాధ్యాయుడు అవసరమయ్యే పరిస్థితి ఉందని నివేదిక పేర్కొంది.భారత్‌లోని స్కూళ్లలో ప్రాథమిక దశ నుంచి 12వ తరగతి వరకు 11 లక్షల మందికిపైగా ఉపాధ్యాయుల కొరత ఉందని యునెస్కో నివేదిక తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని తెలిపింది. యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు వివరించింది. భారత్‌లో ఉపాధ్యాయుల కొరతకు మరో ఉదాహరణ ఏకోపాధ్యాయ పాఠశాలలు. యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ గణాంకాల ప్రకారం దేశంలో సుమారు లక్ష పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో పని చేస్తున్నాయి.

పండుగకు ఊరెళ్తున్నారా?
బస్సు చార్జీలు చూస్తే షాకే!

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం కూడా ప్రయాణికుల రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలతో పాటు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైళ్లు సైతం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిశాయి. మరోవైపు సొంత వాహనాల్లో బయలుదేరారు. కార్లు, బైక్‌లు తదితర వాహనాలు నగర ప్రధాన రహదారులపై బారులు తీరాయి.

కిక్కిరిసిన జనరల్ బోగీలు..

దసరా, దీపావళి పండుగల రద్దీ దృష్ట్యా దక్షిణమధ్య రైల్వే సుమారు 600 రైళ్లను అదనంగా నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. తెలంగాణ మీదుగా వివిధ ప్రాంతాలకు బయలుదేరే అన్ని రైళ్లలో సాధారణ బోగీలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. చర్లపల్లి, నాంపల్లి, కాచిగూడ, మల్కాజిగిరి, హైటెక్‌సిటీ, లింగంపల్లి, తదితర స్టేషన్‌ల నుంచి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు.పండుగలు, ప్రత్యేక వేడుకలు, తదితర సందర్భాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిసారి ప్రయాణికులపై భారం మోపుతున్న ఆర్టీసీ.. ఈసారి సాధారణ చార్జీలపై 50 శాతం అదనపు వసూళ్లకు దిగింది. ఉప్పల్, ఎల్‌బీనగర్, జూబ్లీబస్‌స్టేషన్, తదితర ప్రాంతాల నుంచి తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ట్రావెల్స్ వాహనాలు సైతం చార్జీలను అడ్డగోలుగా పెంచాయి. ఎక్కువ చార్జీలు తీసుకొనే ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేయనున్నట్లు రవాణాశాఖ అధికారులు హెచ్చరించారు. ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణాను అరికట్టనున్నట్లు చెబుతున్నా.. ఆచరణలో ఎక్కడా నియంత్రణ చర్యలు కనిపించలేదు. దీంతో ప్రైవేట్ వాహనాల దారిదోపిడీ యథావిధిగా కొనసాగింది.

ఆ ముగ్గురినీ వదలం

(మొదటి పేజీ తరువాయి)

తెలుసు. అందుకే భయపడుతున్నారు" అని ఆయన పేర్కొన్నారు. 'గోవా రక్షణ యాత్ర'లో రాహుల్ పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి రెండు కిలోమీటర్ల మేర నడిచారు. దిల్లీ: ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లలో తరహా హింసను భారత్‌లో సృష్టించేందుకు దేశ వ్యతిరేక ముఠాలతో పాటు కొందరు రాజకీయ నాయకులు కుట్ర పన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. యువతను వారు రెచ్చగొట్టారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్, ఫ్రాన్స్‌ల్లాంటి దేశం భారత్ కాదన్న సంగతిని మాత్రం గుర్తించలేకపోయారని ఆదివారం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. దేశంలో ప్రభుత్వ మార్పు కచ్చితంగా సాధ్యమేనని.. అయితే అది కేవలం ఎన్నికల ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

కరీంనగర్ సాయిధామ్ అపార్ట్మెంట్లో సద్దుల బతుకమ్మ వేడుకలు






కరీంనగర్ అక్టోబర్ 18 (ప్రజాతీర్పు ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర మహిళల ఆత్మగౌరవానికి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను కరీంనగర్ రాంనగర్లో ఉన్న సాయిధామ్ అపార్ట్మెంటులో ఘనంగా నిర్వహించారు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి సాంప్రదాయ పాటలు పాడుతూ వేడుకలను వైభవంగా నిర్వహించారు, మహిళల ఆత్మీయతకు ఐక్యతకు తెలంగాణ సాంస్కృతిక వైభవానికి సద్దుల బతుకమ్మ పండుగ ప్రత్యేకతగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ నివాసులు చీటీ రవీందర్ రావు, ఒంటెల సురేందర్, కరబత్తుల మధు, అయిట్ల ఆంజనేయులు,జువ్వాడి రత్నాకర్ రావు రంగు జగదీశ్వర్, గూడూరి లక్ష్మణ్, వేనిశెట్టి రాజమల్లయ్య,రాజు (లడ్డు),కన్నోజు రాజేంద్ర ప్రసాద్, కీసరి వెంకటేష్,సోయినేని మహేష్, సోయినేని శ్రీహరిలు, పలువురు మహిళలు, మహిళా సోదరీమణులు పాల్గొన్నారు



రాష్ట్రస్థాయి 9వ ర్యాంక్ సాధించిన ప్రజ్ఞావాహినికి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అభినందనలు...

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 18.

జగిత్యాల అర్బన్ మండలం దరూర్ గ్రామానికి చెందిన ఊరే లతా రమేష్ దంపతుల కుమార్తె ప్రజ్ఞావాహిని ఇటీవల నిర్వహించిన అగ్రిసెట్ లో రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంక్ సాధించిన సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ప్రజ్ఞావాహిని మరియు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జగిత్యాల పొలాస వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ డిప్లొమా పూర్తి చేసి, అగ్రిసెట్‌లో రాష్ట్రస్థాయి 9వ ర్యాంక్ సాధించడం అభినందనీయమని అన్నారు. ప్రజ్ఞావాహిని ఉన్నత విద్యలో మరింతగా రాణించి, వ్యవసాయ రంగంలో మంచి భవిష్యత్తుకు చేరాలని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రావు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు గంగారెడ్డి, పనకంటి అనిల్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పై రాహుల్ గాంధీ బొమ్మ

- బతుకమ్మతో అభిమానం చాటుకున్న కాంగ్రెస్ నాయకుడు
- ఏడాదికోసారి కాంగ్రెస్ నాయకుల బొమ్మ

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్18 ప్రజా తీర్పు):



?"తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ... పూల పరవశంలో పల్లెలు మురిసిపోతుంటే, తన ప్రియతమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారో కాంగ్రెస్ నాయకుడు!" గత ఏడాది సీఎం రేవంత్ రెడ్డి బొమ్మ బతుకమ్మపై వేయగా ఈసారి ఏఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ బొమ్మను బతుకమ్మపై వేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోగూరి శ్రీనివాస్ రెడ్డి బతుకమ్మ పండుగ వేళ తన అభిమానాన్ని ప్రత్యేకం చేసుకున్నారు. నేర్పుగా తయారు చేసిన బతుకమ్మపై రాహుల్ గాంధీ చిత్రపటాన్ని నిలిపి అందరి దృష్టిని ఆకర్షించారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటంతో బతుకమ్మను అలంకరించి తన అభిమానాన్ని చాటుకున్న శ్రీనివాస్ రెడ్డి... ఈసారి కాంగ్రెస్ అగ్రనేత ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ బొమ్మతో బతుకమ్మను పేర్చి మరోసారి స్థానికంగా హాట్ టాపిక్‌గా మారారు. సంస్కృతితో పాటు నాయకులపై ఉన్న ప్రేమాభిమానాలను ఇలా వినూత్నంగా చాటుకోవడం స్థానికంగా విశేషంగా నిలిచింది.ప్రజా నాయకుడిపై ఉన్న అభిమానం పూల బతుకమ్మై వికసించిందంటూ గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా గోగూరి శ్రీనివాస్ రెడ్డిని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి,జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి మర్రి శ్రీనివాస్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండారి బాల్ రెడ్డి లు అభినందించారు.



కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్, సిఎంఆర్ఫఫ్ చెక్కులు పంపిణిచేసిన ఎమ్మెల్యే కోరంకనకయ్య

- పేద ప్రజలసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(పొనకంటి ఉపేందర్ రావు ప్రహతీర్పు టేకులపల్లి) అక్టోబర్ 18

పేద ప్రజలందరికి సంక్షేమ పధకాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది-ఎమ్మెల్యే కనకయ్య భారత దేశంలోనే సన్నబియ్యం ఇచ్చే ఏకైక రాష్టం తెలంగాణ రాష్టం మాత్రమే.కళ్యాణ లక్ష్మి,సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి కార్యక్రమం నిర్విరమంగాకొనసాగిస్తున్నాం.భారత దేశాన్ని 15సంవత్సరాలుగా పాలిస్తున్న బిజేపి పార్టి కుడా మన ప్రభుత్వంలా పధకాలు ఇవ్వడం లేదువారి పాలనలో నిట్ పరీక్ష పత్రాలు లిక్ తో ఎంతో మంది విధ్యార్ధుల భవిష్యత్ అంధకారంలో వెళ్ళిన పరిస్థితి.దేశ యువత మొత్తం బిజేపిని గద్దె దించాలని రాహుల్ గాంధీ ని ప్రధాని చేయాలని చుస్తున్నారుఇల్లందు నియోజకవర్గం ప్రజలందరికి సద్దుల బతుకమ్మ, విజయ దశమి పండుగ శుభాకాంక్షలు. టేకులపల్లి మండలం ముత్యాలంపాడుఐరోడ్డు గ్రామ పంచాయితిపరిధిలోని రైతు వేదిక లిస్దానిక తాహశీల్దార్ వీరభద్రం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధిగాహజరై లభ్ధిదారులకు చెక్కులు పంపిణి చేసిన ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు టేకులపల్లి మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు లక్కినేని శ్యాంబాబు, నాయకులు ఈది గణేష్, కాలే ప్రసాద్, రెడ్యా నాయక్, భుక్యా రవి నాయక్ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గోన్నారు..

భక్తులపైకి ట్రక్కు.. 15 మంది మృతి

41 మందికి తీవ్ర గాయాలు.. మధ్యప్రదేశ్‌లో ఘటన

భక్తులపైకి ఓ ట్రక్కు దూసుకెళ్లడంతో 15 మంది మృతి చెందారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రాంతంలోని శీతలామాత ఆలయం వద్ద దర్శనంకోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఛినోర్ నుంచి వడ్ల లోడుతో వస్తున్న ఓ ట్రక్కు అదుపు తప్పి భక్తుల మీదికి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. 41 మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు.



దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన ఏడుపాయల వనదుర్గామాత

పాపన్నపేట/మెదక్, అక్టోబర్ 18 (ప్రజా తీర్పు ప్రతినిధి)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మెదక్ జిల్లా ఏడుపాయల శ్రీ వనదుర్గాభవానీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో ఎనిమిదవ రోజైన ఆదివారం అమ్మవారు శ్రీ దుర్గాదేవి అవతారంలో ఎరుపు వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నవరాత్రి ప్రత్యేక పూజారులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అత్యంత సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఏడుపాయలకు తరలివచ్చారు. ప్రత్యేక మండపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తులకు అన్నప్రసాదం

నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నప్రసాదం అందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, దీపక్ రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

'సర్'లో ఓటు కోల్పోతే ఫామ్-6తో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో పేర్లు తొలగించబడినవారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించవచ్చని ఎన్నికల సంఘం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. సర్ ప్రక్రియలో ఓటు కోల్పోయిన ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈసీ ఈ విషయం వెల్లడించింది. తాము చిరునామా మారడంతో గణన ప్రక్రియలో పాల్గొనలేకపోయామని, అందువల్ల ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోయాయని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు.



నెల రోజుల వ్యవధిలో నలుగురు పోలీస్ సిబ్బంది బదిలీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 18 (ప్రజా తీర్పు):

ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్లో రెండు నెలల కాలవ్యవధిలో ముగ్గురు కానిస్టేబుళ్లు ఒక హెడ్ కానిస్టేబుల్ ల పై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు వేటు వేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్లో బ్లూ కోర్ట్ కానిస్టేబుల్స్ గా విధులు నిర్వహిస్తున్న దిలీప్ రావు, దినేష్, సాయి విహార్ ఇసుక వివాదంలో అవినీతి ఆరోపణల మధ్య బదిలీ కాగా శనివారం రాత్రి పది గంటల ప్రాంతంలో ఇదే మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు వంగల రాజిరెడ్డి పట్ల దురుసుగా వ్యవహరించడం, కాలర్ పట్టి కొట్టాడని ఆరోపణల మధ్య షబ్బీర్ పాష అనే హెడ్ కానిస్టేబుల్ పై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు బిజెపి నాయకుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకొని హెడ్ క్వార్టర్ కు అటాచ్డ్ చేశారు. దిలీప్ రావు ను పోలీస్ హెడ్ క్వార్టర్ కు,దినేష్, సాయి విహార్ లను గంభీరావుపేట పోలీస్ స్టేషన్ కు అటాచ్డ్ పై పంపించారు. శనివారం రాత్రి జరిగిన సంఘటన నేపథ్యంలో హెడ్ కానిస్టేబుల్ షబ్బీర్ పాష ను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ కు ఆదివారం అటాచ్డ్ చేశారు.నెల రోజుల వ్యవధిలో ముగ్గురు కానిస్టేబుళ్ళు, ఒక హెడ్ కానిస్టేబుల్ పై చర్యలు తీసుకోవడం సర్వత్ర చర్చకు దారి తీస్తుంది.

ఇమ్రాన్ ఖాన్‌కు మరోసారి నోటీసులు

బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబైలోని విదేశీయుల ప్రాంతీయ కార్యాలయం (ఎఫ్ఆర్ఆర్వో) మరోసారి నోటీసులు జారీ చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనల్లో పాల్గొన్నందుకు అక్టోబర్ 28లోపు దేశం విడిచి వెళ్లాలని ఇప్పటికే ఎఫ్ఆర్ఆర్వో నోటీసులు ఇచ్చింది. తాజా నోటీసుల్లో.. ఇమ్రాన్ ఖాన్ ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోదాను ఎందుకు రద్దు చేయకూడదో 15 రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆదేశించింది. దీనిపై ఇమ్రాన్‌ఖాన్ ఇప్పటి వరకు స్పందించలేదు.

బీజేపీ నాయకుడిపైహెడ్ కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన

- మద్యం మత్తులో దాడి చేశారని ఆరోపణ..
- కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని బీజేపీ నేతల డిమాండ్.
- హెడ్ క్వార్టర్ కు హెడ్ కానిస్టేబుల్ అటాచ్డ్

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్18 ప్రజా తీర్పు):



ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ షబ్బీర్ పాషాపై బీజేపీ నాయకుడు వంగల రాజు రెడ్డి దురుసు ప్రవర్తన, దాడి ఆరోపణలు చేశారు.విధుల్లో ఉన్న కానిస్టేబుల్ మద్యం సేవించి తనపై దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడి చేయి చేసుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై సంబంధిత కానిస్టేబుల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బిజెపి నాయకులు వంగల రాజిరెడ్డి శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో బీజేపీ నాయకుడు రాజిరెడ్డికి సంబంధించిన అమ్మవారి బతుకమ్మ,దసరా శుభాకాంక్షల ఫ్లెక్సీని తీసుకెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు.ఆ సమయంలో ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ షబ్బీర్ పాషా మద్యం సేవించి ఉన్నారని, తనతో దురుసుగా ప్రవర్తించి దాడి చేశారని బాధితుడు ఆరోపించినట్లు తెలిపారు. అనంతరం రాజిరెడ్డి మద్యం సేవించాడనే అనుమానంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించగా, ఆయన మద్యం సేవించలేదని తేలినట్లు బీజేపీ నాయకులు వెల్లడించారు.ఈ నేపథ్యంలో మద్యం మత్తులో విధులు నిర్వహిస్తూ దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలి.

ఈ ఘటనపై స్పందించిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ షబ్బీర్ పాషాను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుల ఫిర్యాదుపై స్పందించిన ఎల్లారెడ్డిపేట సీఐ, ఓదెల వెంకటేష్ ఘటనకు సంబంధించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

అంబేద్కర్ కృషి ఫలితమే దళిత, బహుజనులకు రిజర్వేషన్లు!

- బోడుప్పల్‌లో ఘనంగా 400వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం.
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య.

మేడిపల్లి, అక్టోబర్ 18 ప్రజాతీర్పు:



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన అవిశ్రాంత పోరాటం, కృషి ఫలితంగానే నేడు దళిత, బహుజన, బడుగు బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు, సమాన అవకాశాలు లభిస్తున్నాయని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ఆదివారం అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి 400వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి కోటి, భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, డీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మందుల సూర్యకిరణ్ హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి కోటి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం సాధనకు అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగమే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. దళితులు, బహుజనులు నేడు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుకు సాగుతున్నారంటే అందుకు అంబేద్కర్ చేసిన త్యాగాలు, పోరాటాలే కారణమన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి గొప్ప విలువలతో కూడిన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్ల ద్వారా ఉన్నత పదవులు పొందుతున్న కొందరు అంబేద్కర్ ఆశయాలను విస్మరించడం బాధాకరమన్నారు. అటువంటి వారికి నత్తి మైసయ్య నిర్వహిస్తున్న జ్ఞానమాల కార్యక్రమం కనువిప్పు కావాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే సంకల్పంతో సుమారు ఏడేళ్లుగా ప్రతి ఆదివారం నిరంతరాయంగా జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 400 ఆదివారాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. సామాజిక చైతన్యానికి, అంబేద్కర్ భావజాల వ్యాప్తికి ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు.

అంబేద్కర్ ఆశయాల సాధనే మా లక్ష్యం: నత్తి మైసయ్య

అనంతరం అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు అందించడమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు వాటి పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమాజ నిర్మాణమే అంబేద్కర్‌కు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

అక్టోబర్ 25న భారీ బహిరంగ సభ

400 ఆదివారాల జ్ఞానమాల కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా అక్టోబర్ 25న 401వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమంతో పాటు బహిరంగ సభను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నత్తి మైసయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇటికల రవీందర్, గరుగుల యాకయ్య, బండారి సాయి, శ్రీరాముల జ్ఞానేశ్వర్, రామకృష్ణ, జడ శ్రీనివాస్, బెక్కం శివ, చిల్ల అంజయ్య, వల్లపు శీను, డింపు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 18

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో గల 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, రోగుల పరిస్థితి, ఆసుపత్రికి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వ్యాధుల వివరాలు తెలుసుకుని వైద్యులకు పలు సూచనలు చేశారు. వార్డులను స్వయంగా పరిశీలించి, రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పండుగల వేళలలో కూడా ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు వైద్యులు తప్పనిసరిగా విధులలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ వార్డు నిరంతరం తెరిచి ఉంచాలని, కనీసం ఒక మెడికల్ డాక్టర్ విధిగా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాసాయిపేట మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

(వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) అక్టోబర్ 18

మెదక్ జిల్లా సర్వాపూర్ నియోజకవర్గం మాసాయిపేట మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి చిన్నారుల కేరింతల మధ్య రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు పాడుతూ, బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన పూల పండుగ , ప్రకృతిని ఆరాధిస్తూ, పూల అందాలను పూజిస్తూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మీయతకు, సాంస్కృతిక వారసత్వానికి. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాలను,భావితరాలకు అందించడం . బతుకమ్మ పండుగలో ఉపయోగించే తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలు ప్రకృతి వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తాయని, పూలను సేకరించడం, బతుకమ్మలను తయారు చేయడం ద్వారా ప్రకృతితో బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యత, సంతోషం, పరస్పర గౌరవాన్ని , తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పండుగను ఆనందంగా జరుపుకుంటున్నారు. ఈ బతుకమ్మ పండుగను బతుకమ్మ మన ఆడిబిడ్డగా, గౌరమ్మను పూజించడం మన సాంప్రదాయం. అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేసి పసుపు బొట్టు, ప్రసాదాలు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు.

అరుణాచలంలో బెల్లంపల్లి బతుకమ్మ సంబరాలు!

అరుణాచలేశ్వరుని సన్నిధిలో తెలంగాణ సంస్కృతి వైభవం

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 18



తెలంగాణ రాష్ట్రం లోని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కి చెందిన మహిళలు అరుణాచలం పుణ్యక్షేత్రం లో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలేశ్వరుని దర్శించుకున్న అనంతరం, రాజగోపురం ముందు మహిళలందరూ ఒక్కచోట చేరి తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.తెలంగాణలో ఎంతో వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగను ఈసారి స్వరాష్ట్రంలో జరుపుకోలేకపోయినా, బెల్లంపల్లికి చెందిన మహిళలు అరుణాచలం పుణ్యభూమిలోనే బతుకమ్మను ఆడుతూ తమ సంప్రదాయాలపై ఉన్న మమకారాన్ని చాటిచెప్పారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణకు దూరంగా ఉన్నా.. తెలంగాణ సంస్కృతికి దూరం కాలేదు! అన్నట్లుగా బెల్లంపల్లి మహిళలు నిర్వహించిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది. బతుకమ్మ అనేది కేవలం పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతిని ఆరాధించే మన సంప్రదాయానికి ప్రతీక అని ఈ సందర్భంగా చాటిచెప్పారు. అరుణాచలేశ్వరుని దర్శనం, గిరి ప్రదక్షిణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు తమ ప్రాంతీయ సంస్కృతిని కూడా గౌరవిస్తూ పండుగ జరుపుకోవడం విశేషం. పుట్టిన ఊరికి, సొంత ప్రాంతానికి దూరంగా ఉన్నప్పటికీ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను మరిచిపోకుండా ఆచరించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. బెల్లంపల్లి మహిళల బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి సరిహద్దులు దాటి ఎక్కడైనా వెలుగొందగలదనే సందేశాన్ని అందించాయి. అరుణాచలం పుణ్యక్షేత్రంలో తెలంగాణ బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ద్వారా తమ ప్రాంతంపై ఉన్న ప్రేమను, సంప్రదాయాలపై ఉన్న భక్తిని మహిళలు చాటిచెప్పారు.



బాచుపల్లిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

- ఆటపాటలతో హోరెత్తిన పోచమ్మ ఆలయ ప్రాంగణం
- ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు..

బాచుపల్లి,అక్టోబర్ 18: ప్రజా తీర్పు)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు బాచుపల్లిలో వైభవంగా జరిగాయి. బాచుపల్లిలోని పోచమ్మ ఆలయం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని పూల బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాహలం, బతుకమ్మ పాటలతో ఆలయ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. బాచుపల్లి మాజీ సర్పంచ్, ఎన్ఎంసీ మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నిర్వహించిన ఈ వేడుకలు స్థానికంగా పండుగ వాతావరణాన్ని నింపాయి. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల సందడి ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడంతో బాచుపల్లిలో పండుగ కళ ఉట్టిపడింది.



పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 18.

తెలంగాణ సంస్కృతి,సాంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆట పాటలు, కోలాటాలతో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ యొక్క కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గారు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే పండుగ అని ఇలాంటి వేడుకలు సాంప్రదాయ విలువలను కాపాడటమే కాకుండా, కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయి అని అన్నారు.ఎక్కడైనా దేవుళ్లకు పూలు పెట్టి కొలుస్తాము, కానీ పువ్వులనే దేవతగా కొలిచే సాంప్రదాయం ఒక తెలంగాణ లో మాత్రమే ఉందన్నారు. తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతకమ్మని మరియు తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయి తెలిపారు. పోలీసు కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఆడటం ఇంత మంది కుటుంబ సభ్యులను కలిసినందుకు వారితో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది,వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సాంప్రదాయ ఉత్సాహాన్ని పంచుకున్నారు. మహిళా పోలీస్ సిబ్బంది అందరూ రంగురంగుల చీరలతో బతుకమ్మలను అలంకరించి పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో వేడుకను జరిపారు. అలాగే అందంగా, సాంప్రదాయ శైలిలో బతుకమ్మలను రూపొందించిన వారికి ప్రత్యేక బహుమతులను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ పురుషోత్తం రెడ్డి,ఇన్స్పెక్టర్లు మరియు ఎస్.ఐ లు మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

నాయకులగూడెంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

సుజాతనగర్, అక్టోబర్ 18 ప్రజా తీర్పు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని నాయకులగూడెంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. బతుకమ్మ పండుగలో భాగంగా ఎనిమిదో రోజు నిర్వహించిన వేడుకలు పల్లె వాతావరణాన్ని పండుగ శోభతో నింపాయి. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో బతుకమ్మలను పేర్చి, రంగురంగుల పూలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

డీజే పాటలకు యువత ఉత్సాహభరిత నృత్యాలు

బతుకమ్మ వేడుకల్లో భాగంగా డీజే పాటలతో నాయకులగూడెం సందడిగా మారింది. ఉత్సాహభరితమైన పాటలకు మహిళలు, యువతులు, యువకులు కలిసి నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో గడిపారు. సంప్రదాయ బతుకమ్మ పాటలతో పాటు ఆధునిక డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ వేడుకలను మరింత ఉత్సాహంగా మార్చారు. చిన్నారులు సైతం పెద్దలతో కలిసి నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పాటలు, ఆటలు, కేరింతలతో వేడుకల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

సంప్రదాయ కోలాటాలతో ప్రత్యేక ఆకర్షణ

బతుకమ్మ సంబరాల్లో సంప్రదాయ కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా కోలాటాలు ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. ఒకవైపు కోలాటాలు, మరోవైపు బతుకమ్మ పాటలు, ఇంకోవైపు డీజే సంగీతానికి నృత్యాలు చేస్తూ అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వయసుతో సంబంధం లేకుండా మహిళలు, యువతులు, చిన్నారులు వేడుకల్లో భాగస్వాములయ్యారు. సంప్రదాయ కళలను కాపాడుకుంటూనే ఆధునిక సంగీతానికి అనుగుణంగా సంబరాలు జరుపుకోవడం వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల పండుగ వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి సంవత్సరం ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆడిపాడటం ఈ పండుగ ప్రత్యేకత. మహిళల ఐక్యతకు, కుటుంబాల మధ్య అనుబంధాలకు, సమాజంలో సోదరభావానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తోంది. నాయకులగూడెంలో నిర్వహించిన ఎనిమిదో రోజు బతుకమ్మ సంబరాలు స్థానిక ప్రజల్లో ఆనందాన్ని నింపాయి. సంప్రదాయ ఆటపాటలతో పాటు కోలాటాలు, డీజే పాటలకు నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు సందడిగా సాగాయి. పండుగ సందర్భంగా మహిళలు ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకోవడం, తమ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడం విశేషంగా నిలిచింది. నాయకులగూడెంలో జరిగిన బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని మరోసారి చాటిచెప్పాయి. ఆనందోత్సాహాల మధ్య సాగిన ఈ వేడుకలు స్థానికంగా పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.

చైనా ఏజెంట్లకు సున్నిత సమాచారం.. సైనికాధికారి భార్యపై ఎఫ్ఐఆర్

విద్యావేత్తల ముసుగులో ఉన్న చైనా నిఘా ఏజెంట్లతో దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారం పంచుకొన్నందుకు సీనియర్ సైనికాధికారి భార్యపై జమ్ము కశ్మీర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తెలంగాణకు చెందిన నిందితురాలు ప్రస్తుతం జమ్ములో నివసిస్తున్నారు. అయితే తనను సంప్రదించినవారు చైనా నిఘా వర్గాలకు చెందినవారన్న విషయాన్ని గ్రహించలేక ఆమె వారితో సమాచారాన్ని పంచుకొన్నట్టు తెలిసింది.



దుర్గాభవాని అమ్మవారి పూజలో పాల్గొన్న అనిల్ కుమార్ యాదవ్

శేరిలింగంపల్లి, అక్టోబరు 18 ప్రజా తీర్పు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా స్థానికంగా కొలువుదీరిన దుర్గామాత మండపాలను సందర్శించి ,ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అర్చనలు కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. జగన్మాత అయిన దుర్గాదేవి కృపాకటాక్షాలతో శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలు వర్ధిల్లాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. అలాగే నియోజకవర్గం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ఉత్సవ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రతన్ టాటా రెండవ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

- వ్యాపార రంగంలోనే కాదు.. సేవా భావంలోనూ ఆదర్శప్రాయుడు రతన్ టాటా

భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 18 ప్రజా తీర్పు

ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ రతన్ టాటా రెండవ వర్ధంతి సందర్భంగా ఝాన్సీరాణి ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈఓ కొచ్చర్ల కమలరాణి ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. వ్యాపార రంగంలో అపార విజయాలు సాధించడంతో పాటు సేవ, మానవత్వం, నిజాయితీతో కోట్లాది మంది హృదయాల్లో రతన్ టాటా చిరస్థాయిగా నిలిచారని నిర్వాహకులు పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి, సమాజ సేవకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రతన్ టాటా భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, ఆదర్శాలు ఎప్పటికీ అందరికీ స్ఫూర్తినిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీరాణి ఫైనాన్షియల్ సర్వీసెస్ భద్రాద్రి కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ సతీష్ జక్కుల పాల్గొని రతన్ టాటా స్మృతికి ఘన నివాళులర్పించారు.



బతుకమ్మ వేడుకలకు కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ఆర్థికసాయం

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) అక్టోబర్ 18

సంస్కృతి,సంప్రదాయాలకు నిలువెత్తు రూపం బతుకమ్మ పండుగ అని ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ అన్నారు.పండుగ సందర్భంగా గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు బతుకమ్మ గద్దెల వద్ద సంబరాలు జరుపుకుంటున్న ఆడబిడ్డలకు ఆయన ఒక్కో గద్దెకు ?2,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కోరం సురేందర్ మాట్లాడుతూ,తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి,సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ చిన్నపాటి సహాయాన్ని అందించినట్లు తెలిపారు.పండుగల వేళ ప్రజల సంతోషంలో భాగస్వామి కావడం తనకెంతో తృప్తినిస్తుందని పేర్కొన్నారు.ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ,సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్న కోరం సురేందర్ సేవాభావాన్ని గ్రామస్తులు,మహిళలు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇరప రుక్మిణి తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రపంచమంతా 'జంతర్ మంతర్'!



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా భారత్‌లో జరుగుతున్న నిరసనలకు మద్దతుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రవాస భారతీయులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత, ఓటు హక్కు కోసం 'ప్రతి చోటా జంతర్‌మంతర్' పేరిట వివిధ దేశాల్లో వీధుల్లోకి వచ్చారు. అక్టోబర్ 16న లండన్, జర్మనీలోని ఎర్లాంగెన్‌లో ప్రారంభమైన నిరసనలు మరుసటి రోజు జర్మనీ, ఐర్లాండ్, నెదర్లాండ్స్, స్వీడన్, ఫిన్‌లాండ్, కెనడా, అమెరికా, చెక్ రిపబ్లిక్‌లోని పలు నగరాలకు విస్తరించాయి. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, బ్రిస్బేన్‌తోపాటు న్యూయార్క్‌లోనూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

లండన్‌లో భారత హైకమిషన్ ఎదుట..

స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లండన్‌లోని భారత హైకమిషన్ ఎదుట నిరసన ప్రదర్శన జరిగింది. ఎన్నికల సమగ్రత కాపాడాలని, సీఈసీ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ స్క్వేర్‌లో జరిగిన మరో ప్రదర్శనలో యూట్యూబర్ ధ్రువ్‌పాల్గొన్నారు.

రాష్ట్రమంతా నీళ్ల గోస ఉన్న సిద్ధిపేటలో మాత్రం మత్తడి దూకుతున్న కొమటి చెరువు

- కాలేశ్వరం నిర్మాణంతోనే సిద్ధిపేటకు స్వచ్ఛమైన గోదావరి జలాలు..
- బతుకమ్మ పండుగ తెలంగాణకే సొంతం.
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్ రావు .

సిద్ధిపేట అక్టోబర్ 19 ప్రజా తీర్పు

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్ర మొత్తం నీళ్లు నీళ్లు అని కరువుతో అలలాడిపోతుంటే సిద్ధిపేట కోమటి చెరువు గోదావరి జలాలతో మత్తడి దూకుతుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా ఆయన ఆదివారం కుటుంబ సమేతంగా కోమటి చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో కలియతిరిగి ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కావడంతోనే సిద్ధిపేటకు స్వచ్ఛమైన గోదావరి జలాలు వచ్చాయన్నారు. ఒకప్పుడు మురికి నీళ్లతో ఉండే చెరువు నేడు స్వచ్ఛమైన గోదావరి జలాలతో నిండుగా ఉందాన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ కే సొంతమన్నారు. తెలంగాణ బిడ్డలు మన సంస్కృతి, సాంప్రదాయాలతో ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర



ఏర్పడ్డగా ఈ బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. సిద్ధిపేట కోమటి చెరువు ను అన్ని విధాల అభివృద్ధి చేయడంతోనే ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య ఈ బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్నారన్నారు.

కరీంనగర్ వాడవాడలా సద్దుల బతుకమ్మ సంబరాలు

- పూల పండుగలో మహిళల కోలాహలం..
- 64వ డివిజన్‌లో వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ పడాల శ్రీజ-అజయ్

జక్కుల శ్రీకాంత్, కరీంనగర్ అక్టోబర్ 18 (ప్రజాతీర్పు ప్రతినిధి)

కరీంనగర్ నగరంలో సద్దుల బతుకమ్మ వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. బ్యాంక్ కాలనీ, సూర్యనగర్, ఆరేపల్లి, సీతారాంపూర్, రేకుర్తి, వావిలాలపల్లి తదితర ప్రాంతాల్లో మహిళలు, ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ బతుకమ్మ పాటలకు చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. దీంతో కాలనీలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. ముకరంపురలోని 64వ డివిజన్‌లోనూ బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. మహిళలు అందంగా అలంకరించిన బతుకమ్మలతో సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పడాల శ్రీజ-అజయ్ పాల్గొని వేడుకల్లో భాగస్వామ్యమయ్యారు.



నగరంలోని పలు కాలనీల్లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి. మహిళలు సామూహికంగా పాల్గొని పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

టైగర్‌ష్రాఫ్‌పై కాల్పులు.. తీవ్రంగా గాయపడిన డ్రైవర్

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు జరగడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆదివారం సాయంత్రం ముంబైలోని జుహు ప్రాంతంలో కారులో వెళ్తుండగా ముగ్గురు బైక్‌పై వచ్చి కాల్పులు జరిపారు. ఈ దాడిలో కారు డ్రైవర్‌తో పాటు ఆటోడ్రైవర్ కూడా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తున్నది. నటుడు టైగర్‌ష్రాఫ్ క్షేమంగా ఉన్నాడని, అతనికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ఆ దుండగులు ఎవరు అనే కోణంలో సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ఈ కాల్పులు జరిపింది తామే అని బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన అనిల్ పండిత్, హర్మన్ సంధుల పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి.



శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

(వినోద్, ప్రజా తీర్పు, మల్కాజ్‌గిరి) అక్టోబర్ 18

శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈరోజు మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని నేరేడ్‌మెట్, వినాయక్ నగర్, మౌలాలి డివిజన్‌లోని కాకతీయ నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 15 అమ్మవారి మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే సందర్శించిన అమ్మవారి మండపాల వద్ద భక్తులు, స్థానిక మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తిభావం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జీకే హనుమంతరావు, జేఏసీ వెంకన్న, అమీనుద్దీన్, భాగ్యనంద్ రావు, ఫరీద్, సురేష్, గౌస్ ఇమ్రాన్, శ్రీనివాస్ రెడ్డి, సాయి గౌడ్, సుమన్ గౌడ్, శివ గౌడ్, శంకర్ రావు, శ్రీనివాస్, నవీన్ రాజ్, అవినాష్, పేపర్ శ్రీనివాస్, సంతోష్ గుప్తా, మహేష్, రామకృష్ణ, సంపత్ యాదవ్, సంతోష్, హేమంత్ రెడ్డి, బాలకృష్ణ, బాల, రఘుపతి రెడ్డి, నవాబ్, నర్సింగ్ రావు, వినీత్ తదితరులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

దిగిరానున్న క్యాన్సర్ మందుల రేట్లు

ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధితో పోరాడే వారికి ఊరటకలిగించే విషయం ఇది. క్యాన్సర్ మందుల రేట్లు దిగిరానున్నాయి. నాన్ షెడ్యూల్ విభాగంలోని 137 క్యాన్సర్ మందుల ఎంఆర్‌పీపై దవాఖానలు, డిస్ట్రిబ్యూటర్లు విధించే ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి తగ్గిస్తూ నేషనల్ ఫార్మా ప్రైసింగ్ అథారిటీ నిర్ణయం తీసుకున్నది.

ఇల్లందు ఏరియాలో ఘనంగా ఫ్యామిలీ డే & సద్దుల బతుకమ్మ సంబరాలు

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) అక్టోబర్ 18

సాంప్రదాయ బద్ధంగా గౌరీ పూజతో ప్రారంభమైన వేడుకలు -- ఆటపాటలతో సందడిగా సాగిన సంబరాలు

ఇల్లందు ఏరియా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డే మరియు తెలంగాణ సాంస్కృతిక పండుగైన సద్దుల బతుకమ్మనుపురస్కరించుకొని ఆదివారం జేకే కాలనీలోని బ్లాక్ డైమండ్ స్టేడియంలో బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య ముఖ్య అతిథిగా, సేవా అధ్యక్షురాలు శ్రీమతి వి. రమ గౌరవ అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు గౌరీ పూజ నిర్వహించిన అనంతరం సాంప్రదాయబద్ధంగా సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళలు రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను మైదానానికి తీసుకువచ్చి, వాటి చుట్టూ వలయాకారంలో తిరుగుతూ చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడారు. మహిళల ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో స్టేడియం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన పండుగ అని, ఇది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉందన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ



సంబరాలు జరుపుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. బొడ్డెమ్మతో ప్రారంభమై ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పాటు కొనసాగే ఈ పండుగలో ప్రతి రోజుకూ ఒక ప్రత్యేకత ఉందని తెలిపారు. బతుకమ్మ పాటల్లో మహిళల జీవన అనుభవాలు, కుటుంబ అనుబంధాలు, ప్రేమాభిమానాలు, స్నేహం, భక్తి, ప్రకృతిపై ప్రేమ ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఈ వేడుకల్లో భాగంగా సింగరేణి కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో తమ సద్దుల బతుకమ్మలను తీసుకువచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. అందంగా అలంకరించిన బతుకమ్మలను పరిశీలించి, ఎంపికైన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను నగదు రూపంలోఅందజేశారు. అనంతరం మహిళల ఆధ్వర్యంలో సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటపాటల కార్యక్రమాలు నిర్వహించడంతో వేడుకలు మరింత సందడిగా సాగాయి. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు స్టేడియం ప్రాంగణంలో ప్రత్యేకంగా తాత్కాలిక నీటి కొలనును ఏర్పాటు చేయడంతో పాటు, మహిళలు ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగను జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సాంప్రదాయ వైభవం, తెలంగాణ సంస్కృతీ సంపద ఉట్టిపడేలా ఈ ఫ్యామిలీ డే మరియు సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు

రాములపల్లి లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





(కుమారస్వామి ప్రజా తీర్పు

జగిత్యాల రూరల్) అక్టోబర్ 18

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామంలో శివాజీ నగర్ కామన్ వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం పట్టణంలోని వీధులన్నీ బతుకమ్మ సంబరాలతో విరజిల్లాయి. చిన్న పెద్ద తేడా లేకుండా సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొని సంతోషంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి దాదాపు మధ్యరాత్రి వరకు బతుకమ్మ పాటలు పాడుతూ ఆడుతూ , నృత్యాలు చేస్తూ, కోలాటాలాడుతూ సంబరాలు జరుపుకొని అనంతరం గౌరమ్మకు వీడ్కోలు పలుకుతూ అందుబాటులో ఉన్న నీటి ప్రదేశాలలో నిమజ్జనం చేశారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలలో, నిమజ్జన ప్రాంతాలలో గ్రామపంచాయతీ సిబ్బంది అధికారులు, వీధిలైట్ల ఏర్పాటుచేసి, పరిసరాలను పరిశుభ్రపరిచి అందంగా తీర్చిదిద్దారు.



సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న యువనేత దొంతి అవియుక్త్ రెడ్డి

నర్సంపేట అక్టోబర్ 18 ప్రజా తీర్పు ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర మహిళల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను నర్సంపేట పట్టణంలోని అంగడి మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి తనయుడు, యువనేత శ్రీ దొంతి అవియుక్త్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిళల ఆత్మీయతకు, ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి సద్దుల బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట అంగడి మైదానంలో సద్దుల బతుకమ్మ వేడుకలు

నర్సంపేట అక్టోబర్ 18 ప్రజా తీర్పు ప్రతినిధి కృష్ణ



తెలంగాణ రాష్ట్ర మహిళల ఆత్మగౌరవానికి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను నర్సంపేట పట్టణంలోని అంగడి మైదానంలో ఘనంగా నిర్వహించారు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి సాంప్రదాయ పాటలు పాడుతూ వేడుకలను వైభవంగా నిర్వహించారు మహిళల ఆత్మీయతకు ఐక్యతకు తెలంగాణ సాంస్కృతిక వైభవానికి సద్దుల బతుకమ్మ పండుగ ప్రత్యేకత నిలుస్తుంది ఈ కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ వేల్పుల శ్రీలత నర్సంపేట సీఐ శ్రీనివాస్ ఎస్ఐ అరుణ్ రిపోర్టర్ ఈదుల కృష్ణ ఈ కార్యక్రమంలో మహిళలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



వెళ్లిరా గౌరమ్మా.. మళ్లీ రావమ్మా!

- కోస్నపల్లిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు
- వాడలు.. ఉయ్యాల పాటలతో మార్మోగిన గ్రామం

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) అక్టోబర్18

గొల్లపెల్లి మండలం కోస్నపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామంలోని వీధులన్నీ రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో కళకళలాడాయి. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. ఉయ్యాల పాటలతో గ్రామమంతా సందడిగా మారింది. ఈ నెల 10న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగిశాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగలో ఆడపడుచులు చిన్నా, పెద్దా తేడా లేకుండా పాల్గొన్నారు. గునుగు, తంగేడు తదితర రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి సాయంత్రం గ్రామంలోని ప్రధాన కూడళ్లకు తీసుకొచ్చారు. అక్కడ మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ బతుకమ్మల చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. “చిత్తూ చిత్తూల బొమ్మా.. శివుని ముద్దుల బొమ్మా”, “ఒక్కేసి పువ్వేసి చందమామా..” వంటి జానపద గీతాలతో గ్రామం మార్మోగింది. అనంతరం బతుకమ్మలను చెరువులు, బతుకమ్మ ఘాట్ల వద్ద నిమజ్జనం చేసి, “వెళ్లిరా గౌరమ్మా.. మళ్లీ రావమ్మా!” అంటూ భక్తిశ్రద్ధలతో గౌరమ్మకు వీడ్కోలు పలికారు. అనంతరం మహిళలు పసుపు, కుంకుమలు, వాయినాలు ఇచ్చిపుచ్చుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే సద్దుల బతుకమ్మ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

వీధి వ్యాపారుల కోసం సౌర శక్తి బండి

ఆవిష్కరించిన ఐఐటీ ఖరగ్‌పూర్

డిజిటల్ చెల్లింపుల సౌకర్యం కలిగిన సౌర శక్తితో నడిచే ఆహార విక్రయ బండిని ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసింది. ప్రభుత్వ స్థలాలను శాశ్వతంగా ఆక్రమించకుండా ఈ బండిని వ్యాపారులు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి నడుపుతూ వివిధ వినియోగదారుల బృందాలకు సేవలందించవచ్చు. మూడు చక్రాలు కలిగిన ఈ బండిని శుక్రవారం సంస్థ క్యాంపస్‌లో ప్రారంభించిన ‘నగర ఉద్యమం -- వీధి వ్యాపారి నుంచి చురుకైన పారిశ్రామికవేత్త వరకు’ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ బండిలో ఉత్పత్తులను బాగా ప్రదర్శించే సదుపాయం, మూడు మార్గాల్లో చెత్తను వేరు చేసే పద్ధతి ఉంటాయి. తమ సంస్థ వజ్రోత్సవాల సందర్భంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్టు ఐఐటీ ఖరగ్‌పూర్ సంచాలకులు సుమన్ చక్రవర్తి తెలిపారు. సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం క్షేత్ర స్థాయి పరిష్కారాలకు సాంకేతికతను ఉపయోగించడంలో తమ నిబద్ధతను ఈ ఆవిష్కరణ ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను పరీక్షించడం కోసం తమ సేతు క్లౌడ్ కిచెన్ కనెక్ట్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానిస్తామన్నారు.

వైభవంగా ముగిసిన సద్దుల బతుకమ్మ వేడుకలు!





- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ. 25 లక్షలతో ఏర్పాట్లు
- రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులతో కాలేజీ మైదానం
- పోటెత్తిన ఆడపడుచులు -- కనులపండువగా తీర్చిదిద్దిన బతుకమ్మల ప్రదర్శన
- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్ బాబు
- శాంతిభద్రతల పరిరక్షణలో ముందస్తు చర్యలతో పోలీసుల భారీ బందోబస్తు

జమ్మికుంట, అక్టోబర్ 18 ప్రజాతీర్పు

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువుటద్దమైన బతుకమ్మ పండుగ సంబురాలు జమ్మికుంట మున్సిపల్ పరిధిలో అంబరాన్ని తాకాయి. తొమ్మిది రోజుల పాటు నిత్యం పూల పరిమళాలు, పాటల కోలాహలంతో ఉత్సాహంగా సాగిన ఈ వేడుకల ముగింపు ఘట్టం సద్దుల బతుకమ్మ' ఆదివారం నాడు కనులపండువగా, అత్యంత వైభవంగా నిర్వహించబడింది. విద్యుత్ కాంతులతో కాలేజీ మైదానం దేదీప్యమానం ఈ వేడుకల కోసం జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గం రూ. 25 లక్షల నిధులతో భారీ ఎత్తున విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. పట్టణంలోని కాలేజీ మైదానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, స్వాగత తోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం వేళ వెలిగిన రంగురంగుల కాంతులతో కాలేజీ ప్రాంగణమంతా ఒక వెలుగుల దీవిలా మారడంతో పాటు పండుగ శోభతో కళకళలాడింది. పోటెత్తిన మహిళామణులు పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మైదానంలో ఉంచి, రౌండ్‌గా తిరుగుతూ చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడారు. ఆడపడుచుల ఆటపాటలు, ఉత్సాహంతో పరిసర ప్రాంతాలన్నీ పండుగ మైకంలో మునిగిపోయాయి. అనంతరం నిమజ్జన ప్రాంతంలో భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను నిమజ్జనం చేసి, వాయనాలు మార్చుకున్నారు.

ప్రజాప్రతినిధులు, నాయకుల సందడి

ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రణవ్ బాబు మాట్లాడుతూ---“తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన సంస్కృతి, సాంప్రదాయాలకు ఎంతో ప్రాముఖ్యతనిస్తూ, బతుకమ్మ పండుగను ఎంతో ప్రతిష్టాత్మకంగా, అధికారికంగా నిర్వహిస్తోంది. ఆడపడుచులు ఆనందోత్సవాల మధ్య ఈ పండుగను జరుపుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించింది” అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సైతం మహిళలకు, జమ్మికుంట ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసుల పకడ్బందీ బందోబస్తు

వేలాదిగా మహిళలు తరలిరావడంతో ఎలాంటి తోపులాటలు గానీ, అవాంఛనీయ సంఘటనలు గానీ జరగకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సీఐ రామకృష్ణ గౌడ్ పర్యవేక్షణలో పట్టణ పోలీసులు, అదనపు బలగాలు భారీ బందోబస్తు నిర్వహించారు. కాలేజీ మైదానం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పోలీసులు సమర్థవంతంగా చర్యలు చేపట్టారు.



పైడిమడుగులో అఘోరాల శివతాండవం.. భక్తులకు కనువిందు

- దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ
- ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన అఘోరాల నృత్య ప్రదర్శనలు

కోరుట్ల అక్టోబర్ 18 ప్రజాతీర్పు

జగిత్యాల జిల్లా కొరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన అఘోరాల నృత్య ప్రదర్శనలు భక్తులను, గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా అఘోరాలను రప్పించారు. ఉత్సవ ప్రాంగణంలో నిప్పుల నడుమ డమరుక నాదాలు, భక్తి గీతాల తాళాలకు అనుగుణంగా అఘోరాలు చేసిన శివతాండవ నృత్య విన్యాసాలు భక్తి పారవశ్యాన్ని కలిగించాయి. ఒంటి నిండా విభూతి ధారణ, విలక్షణ వేషధారణలతో వారు చేసిన ఆధ్యాత్మిక నృత్యాలను తిలకించేందుకు పైడిమడుగుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

(బుగ్గ కృష్ణమూర్తి, ప్రజా తీర్పు సిరిసిల్ల) అక్టోబర్ 18

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సద్దుల బతుకమ్మ సంబురాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో మానేరు వాగు వద్ద వేడుకలు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళా ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డీ వై ఎస్ ఓ రాందాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు..



శ్రీ మహాలక్ష్మి ఆలయంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో సందడి.. పూల పండుగతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

జక్కుల శ్రీకాంత్ కరీంనగర్, ప్రజా తీర్పు ప్రతినిధి అక్టోబర్ 18:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే సద్దుల బతుకమ్మ సంబరాలు కరీంనగర్‌లో అంబరాన్నంటాయి. నగరంలోని శ్రీ మహాలక్ష్మి దేవాలయం బతుకమ్మ వేడుకలతో పూలవనంలా ముస్తాబైంది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల సందడి, పండుగ ఉత్సాహంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పూలను దైవ స్వరూపంగా భావిస్తూ ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మల చుట్టూ చేరి పండుగ ఉత్సాహాన్ని చాటుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో పేర్చిన బతుకమ్మలు ఆలయ ప్రాంగణానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. బతుకమ్మ పాటలు, మహిళల సందడి, పూల పరిమళాలతో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. తెలంగాణ ఆత్మగౌరవానికి, ఆడపడుచుల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొనడంతో కార్యక్రమానికి మరింత ప్రత్యేకత ఏర్పడింది. తెలంగాణ సంప్రదాయ పండుగల పట్ల ప్రజల్లో ఉన్న అభిమానం, ఆచార వ్యవహారాల పట్ల చూపుతున్న ఆసక్తి ఈ వేడుకల్లో ప్రతిబింబించాయి. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. శ్రీ మహాలక్ష్మి ఆలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు భక్తులు, మహిళల్లో ఉత్సాహాన్ని నింపాయి. పూల పండుగ సందడితో ఆలయ ప్రాంగణం కళకళలాడగా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల వైభవం మరోసారి ప్రతిబింబించింది.

23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా అక్టోబర్ 23న ప్రజామార్చ్ నిర్వహించనున్నట్టు ‘పీపుల్ అగైనెస్ట్ సర్’ కూటమి ఆదివారం ప్రకటించింది. సర్‌ను రద్దు చేయడంతో పాటు ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను పునరుద్ధరించడం తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. ప్రతి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాల్లో రైతులు, యువకులు, ప్రజాసంఘాల లీడర్లు, మేధావులు, కార్మిక సంఘా లు, విద్యార్థులు జెండాలు పట్టుకుని నిరసనల్లో పాల్గొనాలని కూటమి కోరింది.



కొండాపూర్‌లో వైభవంగా మంత్రిచే బతుకమ్మ ఘాట్ ప్రారంభం

హుస్నాబాద్ అక్టోబర్ 18రవీందర్ ప్రజా తీర్పు

బతుకమ్మ పండుగ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో సర్పంచ్ మార్కరాజ్ ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అంతకుముందు మంత్రి చిగురుమామిడిలో గల శ్రీ దుర్గాభవాని అమ్మవారిని దర్శించుకుని సర్పంచ్ ఆకవరం భవాని శివ ప్రసాద్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పూజలు నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. మహిళలు తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని, బతుకమ్మ వేడుకలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు.



సద్దుల బతుకమ్మ ఘనంగా సంబురాలు

- ఆటపాటలతో అలరించిన మహిళలు
- పువ్వులను దేవతలుగా పూజించే ఏకైక సంస్కృతి తెలంగాణదే..
- ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

హుస్నాబాద్ అక్టోబర్ 18 రవీందర్ ప్రజా తీర్పు

హుస్నాబాద్ నియోజకవర్గ తో పాటు అన్ని గ్రామా లలో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలు మహిళలు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబరాలను యువతులు, చిన్నారుల కోలాట నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఉదయం నుంచే మహిళలు బతుకమ్మ పేర్చడంలో నిమగ్నమయ్యారు. తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా, ఆకర్షణీయం గా తయారు చేశారు. వివిధ గ్రామాల సర్పంచులు మహిళలకు వేడుకల. సంస్కృతి సంప్రదాయాల పరవళ్లతో కలకలలాడింది. బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళాలు పెద్ద సంఖ్యలో హాజరై తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి, ఉత్సాహంగా ఆటపాటలతో గ్రామాలన్నీ మార్మోగించారు. ఈ వేడుకలకు మహిళా బతుకమ్మ ఆటపాటల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.



ఆర్థిక ఫలితాలు కీలకం.. పశ్చిమాసియా సంక్షోభంపైనా మదుపర్ల నజర్

దేశీయ స్టాక్ మార్కెట్లు పడుతూ.. లేస్తూ సాగుతున్నాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో పోల్చితే గత వారం బాంబే స్టాక్ ఎక్సేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,256.94 పాయింట్లు లేదా 3.11 శాతం ఎగిసి 74,729.27 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్సేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 625.70 పాయింట్లు లేదా 2.77 శాతం పెరిగి 23,146.15 దగ్గర ఆగింది. ఇక ఈ వారం విషయానికొస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) ద్వితీయ త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు కీలకం కానున్నాయి. దేశీయ ఐటీ రంగ సంస్థలు ఆశాజనక ఫలితాలను నమోదు చేస్తుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరుస్తున్నది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలు, నిర్ణయాలు కొంత మేర అమ్మకాల ఒత్తిడికి దారితీస్తున్నాయి. అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో దిగొస్తున్న ముడి చమురు ధరలు, ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే బలపడుతున్న రూపాయి మారకం విలువ.. స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్లకు మద్దతిచ్చే వీలుందనే చెప్పవచ్చు. కానీ పశ్చిమాసియా సంక్షోభంతో క్రూడాయిల్ రేట్లు ఇంకా పెరిగితే సూచీలు నష్టాలకు లోనుకావచ్చు. తగ్గితే మదుపర్లు పెట్టుబడులకు మొగ్గుచూపుతారు. విదేశీ మదుపర్ల పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులు, ఎల్ నినో సంబంధిత సమాచారం కూడా మార్కెట్ కదలికల్ని ప్రభావితం చేయగలవు. ముఖ్యంగా ద్రవ్యోల్బణం.. మార్కెట్ పెట్టుబడులను గట్టిగానే ప్రభావితం చేయగలవని చెప్పవచ్చు. ఇక అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,400-23,600 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చని కూడా మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకల్లో సేవా స్ఫూర్తి

- పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ.
- మొహమ్మద్ యాకూబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం.

మేడిపల్లి, అక్టోబర్ 18 (ప్రజాతీర్పు):



బోడుప్పల్ సర్కిల్: జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, పేదలకు చేయూతనందించే సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ యాకూబ్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ చేతుల మీదుగా నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. తన జన్మదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. జన్మదినాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా ఆడంబరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, అవసరంలో ఉన్న పేదలకు సహాయం అందించడం ద్వారా వేడుకలకు నిజమైన సార్థకత చేకూరుతుందని అన్నారు. మానవత్వం, సేవాభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని ఆకాంక్షించారు.

పేద కుటుంబాలను ఆదుకోవాలనే మంచి సంకల్పంతో ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మొహమ్మద్ యాకూబ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ శక్తిమేరకు పేదలకు చేయూతనందిస్తే ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన నాయకులు, కార్యకర్తలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వజ్రేష్ యాదవ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: మొహమ్మద్ యాకూబ్

ఈ సందర్భంగా చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ యాకూబ్ మాట్లాడుతూ.. మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. వజ్రేష్ యాదవ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాజకీయంగా మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ ప్రజలకు సేవలందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ పేదలు, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ ప్రధాన కార్యదర్శులు కుర్రి మహేష్, ఆసర్ల బీరప్ప, మేకల శ్రీనివాస్ గౌడ్, సింగిరెడ్డి రాజురెడ్డి, కార్యదర్శి గడ్డం యాదగిరి, మేడ్చల్ నియోజకవర్గ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ముస్తాక్, చెంగిచెర్ల డివిజన్ మైనారిటీ ఉపాధ్యక్షుడు ఇంతియాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ నగర్ లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

వినోద్, ప్రజా తీర్పు , మల్కాజిగిరి, అక్టోబర్ 18

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని, సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గడ్డం శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రకృతి సిద్ధమైన గునుగు పూలతో పాటు వివిధ రకాల పుష్పాలను ఉపయోగించి, సహజ రంగులతో భారీ సద్దుల బతుకమ్మను సంప్రదాయబద్ధంగా పేర్చారు. బతుకమ్మను సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో బతుకమ్మ వేదిక వద్దకు తీసుకువచ్చి . ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో పాటు కలిసి బతుకమ్మ ఆటలు ఆడుతూ, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఆటలు, బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది. అనంతరం న్యూ విద్య నగర్ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసి, అమ్మవారికి పూజలు నిర్వహిస్తూ సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా ముగించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కుటుంబ సభ్యులు, స్థానిక మహిళలతో కలిసి ఘనంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు గడ్డం శ్రీదేవి కుటుంబం తన వంతు భాగస్వామ్యాన్ని చాటుకుంది.

క్రీడల హబ్ గా హుస్నాబాద్ నియోజకవర్గం

- కబడ్డీ అకాడమీ, స్విమ్మింగ్ పూల్ మంజూరు హర్షనీయం
- కాంగ్రెస్ నాయకుడు బెజ్జంకి బాబు

హుస్నాబాద్ అక్టోబర్ 17 రవీందర్ ప్రజా తీర్పు



రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి హుస్నాబాద్ ను క్రీడల హబ్ గా మారుస్తూ రెండు రోజుల తేడాలోనే కబడ్డీ అకాడమీ, స్విమ్మింగ్ పూల్ హుస్నాబాద్ కు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ నాయకుడు బెజ్జంకి బాబు అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని అన్నారు. హుస్నాబాద్ కు స్విమ్మింగ్ పూల్ మంజూరు చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యా, వైద్య, పర్యాటక, క్రీడా, వ్యవసాయ రంగాల్లో భారీగా నిధులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. హుస్నాబాద్ ను విద్యా హబ్ గా మార్చడానికి ఇంజనీరింగ్ కాలేజ్, రెసిడెన్షియల్ పాఠశాలలు, చెరువుల సుందరీకరణ, గౌరవెల్లి రిజర్వాయర్ పనులను పూర్తి చేయడానికి నిధులు, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, అద్భుతమైన గ్లాసు బ్రిడ్జి వంటి పనులను చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే పర్యాటక రంగంలో హుస్నాబాద్ ను మరొక మార్కుగా చేపట్టడానికి అర్బన్ ఫారెస్ట్ పార్క్, ఆలయాల అభివృద్ధికి నిధులను తీసుకొచ్చిన ఘనత మంత్రిదేనన్నారు. వీటితోపాటు రహదారుల కనెక్టివిటీ, గ్రామాల్లో హైమాస్ విద్యుత్ దీపాల ఏర్పాటుకు కృషి చేస్తూ తన పాలనా కాలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి మంత్రి సంసిద్ధులవుతూ ఉన్నారని చెప్పారు. అలాగే మూడు రోజుల క్రితమే హుస్నాబాద్ కు కబడ్డీ క్రీడా అకాడమీ తీసుకొచ్చారని, నిన్న హుస్నాబాద్ కు స్విమ్మింగ్ పూల్ మంజూరు కూడా జరిగిందని ఇవన్నీ కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతోనే జరిగిందని అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. క్రీడాకారులకు స్వర్ణ యుగం గా చేస్తూ తన యొక్క దూర దృష్టితో రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ క్రీడలకు కూడా పెద్దపీట వేయడం మంత్రి దూర దృష్టికి నిదర్శనం అని పేర్కొన్నారు. మంత్రి,మరిన్ని మంచి కార్యక్రమాలు నియోజకవర్గానికి అందిస్తూ ఉండాలని ఆకాంక్షించారు.

కరీంనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే గంగుల, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

(జక్కుల శ్రీకాంత్,కరీంనగర్, ప్రజాతీర్పు,)అక్టోబరు 18



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు కరీంనగర్ నగరంలో ఆదివారం కన్నులపండువగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. నగరంలోని మార్క్‌ఫెడ్ మైదానంతో పాటు భగత్‌నగర్, తీగలగుట్టపల్లి తదితర ప్రాంతాల్లో వేడుకలు అంబరాన్నంటాయి. ప్రజాప్రతినిధులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. నగరంలోని రాంనగర్ మార్క్‌ఫెడ్ మైదానంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులతో కలిసి సప్తగిరి కాలనీ సమీపంలోని మానేరు నది వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మహిళలతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్న ఆయన సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. నగరంలోని తీగలగుట్టపల్లిలో గల అయ్యప్ప దేవాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, ఆలయం వద్ద ఉంచి మహిళలతో కలిసి సంప్రదాయ బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆడిపాడారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగర ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గౌరమ్మను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. మరోవైపు నగరంలోని భగత్‌నగర్‌లో భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆదర్శ జై భీమ్ యూత్ క్లబ్, చైతన్య యూత్ క్లబ్, పెద్దమ్మ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కపిలేశ్వరస్వామి ఆలయం, సాయికృష్ణ థియేటర్, రాంనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద కూడా సంబరాలు జరిగాయి. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. లోయర్ మానేరు డ్యామ్ లేక్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రంలో మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ఆడపడుచుల ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని పూజిస్తూ, పూలను ఆరాధిస్తూ సామూహికంగా జరుపుకునే ఈ పండుగ మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. భగత్‌నగర్‌లోని వివిధ సంఘాలు, యువజన సంఘాలు కలిసికట్టుగా ప్రతి సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వేడుకల్లో కార్పొరేటర్లు గాజ రమ-శివరాం, పొన్నం లక్ష్మి-మొండయ్య గౌడ్, మహిళా సంఘాల ప్రతినిధులు, వివిధ యువజన సంఘాల సభ్యులు, కాలనీ పెద్దలు, స్థానిక నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ పాటలు, సంప్రదాయ నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొంది.



పూలను పూజించే సంస్కృతి బతుకమ్మ





పాపన్నపేట/మెదక్, అక్టోబర్ 18 (ప్రజా తీర్పు ప్రతినిధి)

పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ఆదివారం పాపన్నపేట మండలం కుర్తివాడలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ సందడి చేశారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెబుతాయని తెలిపారు.అనంతరం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పద్మా దేవేందర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు, జగన్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి,కుర్తివాడ మాజీ సర్పంచ్ లు స్రవంతి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ కిష్టాగౌడ్ గ్రామ అధ్యక్షులు వెంకటేశం, మాజీ ఏడుపాయల డైరెక్టర్ మోహన్ రావు మాజీ ఉపసర్పంచ్ పోతా గౌడ్, నాయకులు సోములు,సిద్ధిరామిరెడ్డి,బాల్ రెడ్డి వడ్ల బ్రహ్మం కమ్మరి బ్రహ్మం మంగలి బొందయ్య వడ్ల మధు విల్సన్, సాయి వర్ధన్ గౌడ్,కాదూరి రాజు, సామెల్,సతీష్ రావు, మల్లేశం, దత్తు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మాయిలు అదుర్స్.. దంచికొట్టిన షెఫాలీ, మంధాన

- రెండో టీ20లో భారత్ ఘన విజయం
- 2-0తో సిరీస్ సొంతం

తొలి మ్యాచ్‌లో జింబాబ్వేపై కష్టపడి గెలిచిన భారత మహిళలు రెండో పోరులో తమ తడాఖా చూపెట్టారు. బౌలర్ల ప్రతిభకు తోడు ఓపెనర్లు షఫాలీ వర్మ (25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 55), స్మృతి మంధాన (25 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 47 నాటౌట్) ఖతర్నాక్ షాట్లతో చెలరేగడంతో ఆదివారం జరిగిన రెండో టీ20లో భారత్ 9 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. ఏకపక్ష పోరులో ప్రత్యర్థి ఇచ్చిన 103 పరుగుల లక్ష్యాన్ని భారత్ 8.5 ఓవర్లలోనే ఛేదించింది.ఆతిథ్య బౌలర్లూ సత్తా చాటడంతో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 102/8 స్కోరు మాత్రమే చేసింది. చిపో ముగెరి తిరిపానో (34), కెప్టెన్ జోసెఫిన్ ఎన్‌కోమో (27 నాటౌట్) టాప్ స్కోరర్లు. భారత స్పిన్నర్ నిక్కీ ప్రసాద్ (2/7) రెండు వికెట్లతో ఆకట్టుకుంది. షఫాలీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య మూడో, చివరి టీ20 మంగళవారం జరుగుతుంది.

ధనాధన్ ఫటాఫట్

చిన్న టార్గెట్‌ను భారత్ అలవోకగా ఛేజ్ చేసింది. గత మ్యాచ్‌లో నిరాశపరిచిన ఓపెనర్లే దాదాపు లాంఛనం పూర్తి చేశారు. కెప్టెన్, వైస్ కెప్టెన్లు అయిన మంధాన, షఫాలీ బౌండరీల కోసం పోటీపడ్డారు. ఇందులో ఫఫాలీదే పైచేయి అయింది. భారీ షాట్లతో అలరించిన ఆమె తొలి ఓవర్లోనే 4, 6తో తన ఉద్దేశం ఏంటో చెప్పింది. న్యాషా వేసిన మూడో ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో మంధాన కూడా టచ్‌లోకి రాగా.. మకుషా బౌలింగ్‌లో షఫాలీ మరోసారి 6,4తో ప్రేక్షకులను అలరించింది. న్యాషా వేసిన ఐదో ఓవర్లో మంధాన అందమైన షాట్లతో వరుసగా నాలుగు ఫోర్లతో స్టేడియాన్ని హోరెత్తించగా..షఫాలీ కూడా ఓ బౌండరీ కొట్టడంతో ఆ ఓవర్లో ఏకంగా 21 పరుగులు వచ్చాయి. ఆపై మరింత జోరు పెంచిన షఫాలీ మవుంగ బౌలింగ్‌లో 4, 4, 6తో విరుచుకుపడి పవర్‌ప్లేను 76/0తో ముగించింది. టీ20ల్లో భారత్‌కు ఇది రెండో అత్యధిక పవర్ ప్లే స్కోరు. మరోవైపు తానేం తక్కువ కాదన్నట్టు ఏడో ఓవర్లో మంధాన క్రీజు దాటొచ్చి డీప్ మిడ్ వికెట్ మీదుగా 85 మీటర్ల భారీ సిక్స్‌తో తన బ్యాట్ పవర్ చూపెట్టింది. బిజా బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో 24 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్న షఫాలీ భారత్‌కు పది వికెట్ల విజయం అందించేలా కనిపించింది. కానీ, తర్వాతి బంతికే మరో షాట్ ఆడి మనుషాకు క్యాచ్ ఇవ్వడంతో తొలి వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్లో లాంగాఫ్ మీదుగా లాఫ్టెడ్ సిక్స్‌తో మంధాన మ్యాచ్‌కు అద్భుత ముగింపునిచ్చింది.

నిక్కీ డబుల్ ధమాకా

జింబాబ్వేను మరోసారి తక్కువ స్కోరుకు పరిమితం చేయడంలో భారత బౌలర్లు సక్సెస్ అయ్యారు. పేసర్లు, స్పిన్నర్లు పొదుపుగా బౌలింగ్ చేశారు. కొత్త బంతితో క్రాంతి గౌడ్, నందని శర్మ కట్టడి చేయడంతో జింబాబ్వే నాలుగో ఓవర్ వరకు బౌండరీల ఖాతా తెరవలేకపోయింది. తన తొలి రెండు ఓవర్లో క్రాంతి రెండే రన్స్ ఇవ్వగా.. 11 బంతులాడి ఒక్క పరుగు చేయని ఓపెనర్ కెలిస్ ఎన్‌డ్లోవు(0)ను నందని బౌల్డ్ చేసింది. పవర్ ప్లేలో 20/1తో నిలిచిన జింబాబ్వే స్పిన్ ఆడటంలోనూ ఇబ్బంది పడింది. ఏడో ఓవర్లో బిజా (7)ను దీప్తి శర్మ పెవిలియన్ చేర్చగా.. తొమ్మిదో ఓవరలో క్రాంతి బౌలింగ్‌లో షార్నె మేయర్స్ (9) కూడా డగౌట్ చేరుకుంది. ఈ దశలో కెప్టెన్ జోసెఫిన్, తిరిపానో నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. తిరిపానో కొన్ని బౌండరీలతో ఆకట్టుకుంది. కానీ, 15వ ఓవర్లో బౌలింగ్‌కు దిగిన ఆఫ్ స్పిన్నర్ నిక్కీ ప్రసాద్ అద్భుతమైన బౌలింగ్‌తో జింబాబ్వే ఇన్నింగ్స్‌ను దెబ్బతీసింది.



అట్టహాసంగా పారా ఆసియాడ్ ఆరంభం

ఐదో ఎడిషన్ పారా ఆసియా క్రీడలు అట్టహాసంగా మొదలయ్యాయి. ఆదివారం జరిగిన ఆరంభ వేడుకల్లో భారత క్రీడాకారులు దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. ఐదో ఎడిషన్ పారా ఆసియా క్రీడలు అట్టహాసంగా మొదలయ్యాయి. ఆదివారం జరిగిన ఆరంభ వేడుకల్లో భారత క్రీడాకారులు దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. 5 వేల ఏండ్ల నాటి మానవ నాగరికత వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక బ్లేజర్లను ధరించి మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పారా షట్లర్ ప్రమోద్ భగత్, పారా స్ప్రింటర్ సిమ్రాన్ శర్మ త్రివర్ణ పతాకాలను చేతబూని జట్టును ముందుండి నడిపించారు. భారత పారా అథ్లెట్లు ధరించిన అధికారిక బ్లేజర్‌లపై సింధు నాగరికత ముద్రలు, ప్రాచీన లిపి నమూనాలు ముద్రించారు. అలాగే కాలర్ భాగంలో సప్తసింధు నదుల ప్రాంతాన్ని స్మరిస్తూ డిజైన్ చేయగా, జేబుపై త్రివర్ణ పతాకాన్ని అలంకరించారు. ఈ క్రీడల్లో భారత్ తరఫున 11 విభాగాల్లో మొత్తం 168 మంది అథ్లెట్లు బరిలోకి దిగారు. ఈనెల 24 వరకు జరిగే ఈ మెగా గేమ్స్‌లో 45 దేశాల నుంచి సుమారు 3వేల మంది పారా అథ్లెట్లు పోటీ పడుతున్నాడు.



ఆర్చరీ లీగ్ చాంప్ మైటీ మరాఠాస్.. రన్నరప్‌తో సరిపెట్టిన కాకతీయ


ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్‌లో మైటీ మరాఠాస్ చాంపియన్‌గా నిలిచింది. స్థానిక జట్టు కాకతీయ నైట్స్‌ను ఓడించి ట్రోఫీ కైవసం చేసుకుంది. పీపుల్స్ ప్లాజా వద్ద ఆదివారం జరిగిన ఫైనల్లో మరాఠాస్ జట్టు 6-2తో కాకతీయకు చెక్ పెట్టింది. ఫైనల్లో ఏపీ కుర్రాడు రికర్వ్ స్టార్ బొమ్మదేవర ధీరజ్ 80కి 79 పాయింట్లతో సత్తా చాటితే మైక్ షూటర్ పర్ఫెక్ట్ 80 పాయింట్లతో మరాఠాస్ విజయంలో కీలకంగా నిలిచారు. తుదిపోరులో ఇరు జట్లూ తొలి సెట్‌లో 75-75తో సమంగా నిలవగా.. రెండో సెట్‌ను ఒక్క పాయింట్ తేడాతో నెగ్గిన మరాఠాస్ కీలక ఆధిక్యం అందుకుంది. మూడో సెట్ కూడా సమం అవ్వడంతో ఆట షూటాఫ్‌కు వెళ్లేలా కనిపించింది. కానీ, నాలుగో సెట్‌లో నైట్స్ ఆర్చర్లు గురి తప్పగా.. మరాఠాస్ ఒత్తిడిలోనూ అద్భుతంగా ఆడింది. ఈ సెట్‌ను 79-74తో గెలిచిన మరాఠాస్ మ్యాచ్ గెలిచి విజేతగా నిలిచింది. రెండు గంటల ముందు ఇరు జట్ల మధ్య క్వాలిఫయర్ పోరులో హిట్ ఆర్ మిస్ షూటాఫ్‌లో నైట్స్ 2-0తో మరాఠాస్‌ను ఓడించి నేరుగా ఫైనల్ చేరింది. అయితే, ఎలిమినేటర్‌లో మరాఠాస్ 5-3తో పృథ్వీరాజ్ యోధాస్‌పై నెగ్గి ఫైనల్ చేరుకొని కాకతీయపై ప్రతీకారం తీర్చుకొని ట్రోఫీని ముద్దాడింది. ధీరజ్ బెస్ట్ రికర్వ్ ఆర్చర్‌గా నిలిచాడు.

ఆ హీరో అంటే నాకు పిచ్చి ఇష్టం.. మనసులో మాట చెప్పిన కృతి శెట్టి!



టాలీవుడ్‌లో 'ఉప్పెన' సినిమాతో ఒక్కసారిగా స్టార్‌డమ్ సొంతం చేసుకున్న యంగ్ హీరోయిన్ కృతి శెట్టి.. తనకు టాలీవుడ్‌లో ఇష్టమైన హీరో ఎవరో గతంలో ఓ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా వెల్లడించింది. స్టార్ హీరో గురించి ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కృతి శెట్టి పేరు చెప్పగానే చాలామందికి ముందుగా గుర్తొచ్చే సినిమా ఉప్పెన. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించిన ఈ చిత్రంతో ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. తొలి సినిమాతోనే తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ.. యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆ సినిమా సాధించిన విజయంతో కృతి శెట్టికి వరుస అవకాశాలు వచ్చాయి. ఉప్పెన తర్వాత నాగచైతన్యతో కలిసి నటించిన 'బంగార్రాజు', నాని నటించిన 'శ్యామ్ సింగరాయ్' సినిమాలు కూడా ఆమెకు మంచి గుర్తింపును తీసుకొచ్చాయి. ఇలా కెరీర్ ఆరంభంలోనే వరుస విజయాలను అందుకున్న కృతి శెట్టి టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా మారుతుందని చాలామంది భావించారు. అయితే కెరీర్ ప్రారంభంలో వచ్చిన విజయాలను కృతి శెట్టి ఆ తర్వాత కొనసాగించలేకపోయింది. ఆమె నటించిన పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాలను అందుకోలేకపోయాయి. దీంతో తెలుగులో అవకాశాలు, క్రేజ్ విషయంలో కొంత వెనుకబడింది. అయినప్పటికీ నటిగా తనను తాను నిరూపించుకోవాలనే ప్రయత్నాన్ని మాత్రం కొనసాగిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటోంది.

అమెరికాలో హిస్టారికల్ వరల్డ్ ప్రీమియర్





దేశమంతా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. నితీశ్ తివారీ రూపొందిస్తున్న ఈ వెండితెర ఇతిహాసంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27న సాయంత్రం అమెరికా లాస్ ఎంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఉన్న డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ జరుగనున్నది. ఆహ్వానం ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించే ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్ ప్రముఖుల, దర్శకులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, పలువురు ప్రపంచ సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఎన్నో అంతర్జాతీయ కార్యక్రమాలకు, ఆస్కార్ వేడుకలకు వేదికగా నిలిచిన అకాడమీ మ్యూజియంలో 'రామాయణ' ప్రీమియర్ జరుగనుండటం భారతీయ సినీచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని మేకర్స్ చెబుతున్నారు. 945మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌లో 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమా స్క్రీనింగ్ జరుగనున్నది. ఇక ఈ ఫ్రాంచైజీకి చెందిన రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రానున్న విషయం తెలిసిందే.

రివార్డులతోపాటు అవార్డులూ సాధించే సినిమా

నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. చిత్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. గట్స్, ప్యాషన్ ఉన్న ఇలాంటి టీమ్ ఉంటేనే, ఈ తరహా విజయాలు సాధ్యమవుతాయి. నేను కమర్షియల్ సినిమాలతోపాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తుండటం వల్ల ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఇవ్వగలుతున్నా. వినోదం, సందేశం రెండూ ఉన్న సినిమా 'క్రేజీకల్యాణం" అని పేర్కొన్నారు. దసరా పండక్కి రక్తపాతాలతో కూడిన సినిమాలతోపాటు రక్తసంబంధాల కథల్ని కూడా చూస్తామని ప్రేక్షకులు రుజువు చేశారని, భావోద్వేగాలతో ప్రతి తెలుగువాడినీ కలిపే సినిమా ఇదని, రివార్డ్స్‌తోపాటు ఈ సినిమా అవార్డులను కూడా సాధిస్తుందని అగ్రనటుడు నరేశ్ వీకే నమ్మకం వెలిబుచ్చారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020